



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 12 సంచిక : 359 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 29 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :359 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 29 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

- రాఖీ పండుగ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల పెంపు
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనం
- రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సు సర్వీసులు
- 1981 నాటి జీవో ప్రకారమే పెంపు అని అధికారుల వెల్లడి
- సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథం

- మిగతా 2లో




## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ.. రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

- రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ
- రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ
- రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయని వ్యాఖ్య

- మిగతా 2లో



## కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా.. రెండేళ్లలో ఇది రెండోసారి!

- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా
- రెండు సంవత్సరాల్లో ఇదే ఆరోపణపై పదవి వీడటం ఇది రెండోసారి
- ప్రెస్ మీట్‌లో తన రాజీనామా ప్రకటిస్తూ కన్నీటిపర్యంతమైన కాంగ్రెస్ నేత
- బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందంటూ నాగేంద్ర ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ పాదయాత్రకు సన్నాహాలు

- మిగతా 2లో



## నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

- నేపాల్‌లో ఆకస్మిక వరదలు
- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం
- నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం



పెన్ పవర్ డెస్క్:నేపాల్-టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది

- మిగతా 2లో

## నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం

- ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం
- అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు
- టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన
- రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ

- మిగతా 2లో

## పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ

- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

- మిగతా 2లో

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి



- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్న పవన్
- ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు,

- మిగతా 2లో

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో

- మిగతా 2లో




## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్: శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- రూ. 100 కోట్లతో చదలవాడ వద్ద 5 స్టార్ హోటల్
- రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో హోటల్
- హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు ఉపాధి

పెన్ పవర్ డెస్క్:ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించి ఒక కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు పరిసర ప్రాంతమైన చదలవాడ వద్ద రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో

- మిగతా 2లో



## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- నార్కోటిక్స్ కేసులు 46 శాతం పెరగడంపై ఆందోళన
- సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల
- తీవ్రమైన నేరాలు తగ్గినా, సాధారణ నేరాలు పెరిగాయన్న గణాంకాలు

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### : ఒకవైపు అధికార పార్టీ బలం..
### మరొకవైపు జగన్ హెచ్చరిక

స్థానిక సంస్థల ఎన్నికలు వైసీపీ నేతల కు ఫీవర్ తెచ్చి పెడుతున్నాయి. బలమైన అభ్యర్థులు, నమ్మకమైన నేతల కోసం ఇప్పటి నుంచే ఆరా తీస్తున్నారు. ప్రధానంగా పదహారు కార్పొరేషన్ లలో మేయర్ పదవి, మున్సిపల్ ఛైర్మన్ ల ఎంపిక వైసీపీ ఇన్ ఛార్జులకు తలనొప్పిగా మారనుంది. అధికార పార్టీని ఎదుర్కొనడం స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో అంత ఈజీ కాదు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా బలంగా ఉంటుంది. ఆర్థికంగా, ఇటు అధికారుల నుంచి సహకారం, మరొకవైపు ఓటర్ల మనోగతం కూడా ఈ ఎన్నికల ఫలితాలను ప్రతిబింబిస్తాయి. మూడేళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తమకు ఎంతో కొంత మేలు, పనులు జరగాలంటే అధికార పార్టీని గెలిపించుకోవడం మంచిదని ప్రజలు సహజంగా విశ్వసిస్తారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతారు.

**స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో...**

కూటమి ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి సాధారణ ఎన్నికల వరకూ బయటపడదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసంతృప్తి కనపరిస్తే తమ నగరం, పట్టణం అభివృద్ధి జరగదని భావిస్తారు. ఇక అధికార పార్టీ సామ, దాన, భేద, దండోపాయాలను ఖచ్చితంగా తమ విజయం కోసం ప్రయోగిస్తుంది. ఆ వత్తిడిని ఎదుర్కొని తట్టుకుని నిలబడే నేత కావాలంటే అధికారంలోని వైసీపీకి అంత సులువు కాదు. ఆర్థికంగా బలంగా ఉండాలి. తన తో పాటు తన వార్డు మెంబర్లకు కూడా ఆర్థిక సాయాన్ని అందించగల నేత అయి ఉంటేనే ఎంతో కొంత తట్టుకోగలరు. అలాగే పార్టీ పట్ల విధేయత, నాయకత్వం పట్ల నమ్మకం ఉన్న నేత కూడా అవసరం. లేకుంటే అధికార పార్టీ ప్రలోభాలకు లొంగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే అన్ని జాగ్రత్తలు వైసీపీ నేతలు తీసుకోవాల్సి ఉంటుంది.

**ప్రత్యక్ష ఎన్నిక కావడంతో...**

ఎందుకంటే ఈసారి మేయర్, ఛైర్మన్ల ఎన్నిక నేరుగా జరుగుతుంది. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరిగే ఎంపిక కావడంతో ఖచ్చితంగా ప్రలోభాలకు చివరి నిమిషం వరకూ గురిచేస్తారు. ఏకగ్రీవం చేసుకోవాలన్నది అధికార పార్టీ పట్టుదలగా ఉంటుంది. మరొకవైపు ఏకగ్రీవమయితే వచ్చే ఎన్నికల్లో సీటు కూడా దక్కదన్న జగన్ హెచ్చరికలు వైసీపీ నేతల చెవుల్లో మారుమోగిపోతున్నాయి. అందుకే ఒకచోట ఇద్దరు నుంచి ముగ్గురు నేతలను ఎంపిక చేసి వారిలో చివరకు ఒకరిని బరిలో ఉంచితే మేలని వైసీపీ నియోజకవర్గ ఇన్ ఛార్జులు భావిస్తున్నారు. కానీ పార్టీ అధికారంలో లేకపోవడంతో ముగ్గురు బలమైన నేతలు దొరకడం అంత సులువు కాదు. తమ జేబులో డబ్బులు పెట్టాలంటే మరింత ఇబ్బంది పడతామని భావిస్తున్నారు. అందుకే వైసీపీ నియోజకవర్గాల ఇన్ ఛార్జుల పరిస్థితి ఒకింత ఆందోళనలో ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయి ఎన్నికలు ముగిసే వరకూ వారికి టెన్షన్ తప్పదు.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- మొదటి పేజి తరువాయి

46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు. పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023-24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025-26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం.కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదు 26.23 శాతం తగ్గడం ఊరటనిచ్చే అంశం.మరోవైపు, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల అధికంగా ఉంది. నార్కోటిక్స్ కేసుల పెరుగుదల పోలీసు శాఖకు పెద్ద సవాలుగా మారిందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ రేటు 96 శాతానికి చేరడంపై ఆయన సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరులో వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని, నేరాల కట్టడికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్: శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజి తరువాయి

నిర్మించనున్న ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ 'రాడిసన్' 5 స్టార్ హోటల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రసిద్ధ రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రతిష్టాత్మక హోటల్ రూపుదిద్దుకోనుంది.ఒంగోలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతున్న మొదటి అంతర్జాతీయ బ్రాండెడ్ 5 స్టార్ హోటల్ ఇదే కావడం విశేషం. 151 విలాసవంతమైన గదులు, మల్టీ-క్యూసిన్ రెస్టారెంట్లు, ప్రీమియం బార్, లాంజ్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్ వంటి అత్యాధునిక సదుపాయాలతో దీనిని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా, బిజినెస్ టూరిజం విస్తరణకు అనుగుణంగా 2,100 చదరపు మీటర్లకు పైగా విశాలమైన స్థలంలో భారీ బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి-16కి అత్యంత సమీపంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ వల్ల పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి.ఈ విలాసవంతమైన 5 స్టార్ హోటల్ రాకతో ఒంగోలు, దాని పరిసర ప్రాంతాల్లో హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం లోకేశ్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. అభిమానులతో ఫొటోలు దిగుతూ, వారి నుంచి వినతులను స్వీకరించారు. రక్షా బంధన్ సందర్భంగా పలువురు మహిళా కార్యకర్తలు లోకేశ్‌కు రాఖీలు కట్టి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్..
# పనితీరుకు అదే ప్రామాణికం

- మొదటి పేజి తరువాయి

ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు.ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ూ4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిం చేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు

జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా..
## రెండేళ్లలో ఇది రెండోసారి!

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర వివాదాస్పదమైన మహర్షి వాల్మీకి గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి బి. నాగేంద్ర శుక్రవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీటిపర్యంతమయ్యారు. గత రెండేళ్ల కాలంలో ఇదే ఆరోపణలపై ఆయన రాజీనామా చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం.ఈ కుంభకోణం నేపథ్యాన్ని పరిశీలిస్తే, వాల్మీకి కార్పొరేషన్‌లో సుమారు రూ. 89 కోట్ల మేర నిధులు అక్రమంగా బదిలీ అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. 2024 మే నెలలో కార్పొరేషన్ అకౌంట్స్ అధికారి చంద్రశేఖరన్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన లేఖతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్పటి సిద్ధరామయ్య ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర, 2024 జూన్‌లో తొలిసారి తన పదవికి రాజీనామా చేశారు. అయితే, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత, 2026 ఆగస్టు 3న నాగేంద్రను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కానీ ప్రతిపక్ష బీజేపీ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురుకావడంతో ఆయన మరోసారి పదవిని వీడాల్సి వచ్చింది. ఈ సందర్భంగా

నాగేంద్ర మాట్లాడుతూ, రాజ్యాంగంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నా బీజేపీ ముందుకు రాలేదని విమర్శించారు. బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందని, ఆ పార్టీ 'మనుస్మృతి'ని రుద్దాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు రాయచూర్ నుంచి బళ్లారి వరకు పాదయాత్ర చేస్తామని బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ యాత్రను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రారంభించనున్నారు.

### రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ..
## రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

### రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ
## ఛార్జీల బాదుడు

రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు భారంగా మారింది.రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సులో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ. 400 వసూలు చేస్తున్నారు. ఛార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై టీజీఎస్ఆర్టీసీ పీఆర్వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

## నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

- మొదటి పేజి తరువాయి

మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి.రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు.ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు.

ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ

**డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు**

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్-1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

**స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

**మరో మూడుసార్లు గెలవాలి**

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు.

తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

**జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి**

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

- మొదటి పేజి తరువాయి

కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు.రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్సై పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



**కురుపాం ఆగష్టు 28 పెన్ పవర్.** మండలంలో నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కుంభీమానుగూడ గ్రామంలో శుక్రవారం నాడు నీలకంఠాపురం సబ్ ఇన్స్పెక్టర్ పీ. రమేష్ నాయకుడు సందర్శించారు.ఈ మేరకు గ్రమంలో వున్నా పేదలకు దుప్పట్లు,విద్యార్థులకు పెన్నులు,పుస్తకాలు పంపిడి చేశారు.ఈ సందర్భంగా ఎసై రమేష్ నాయుడుమాట్లాడుతూ,యువతి యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని.మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించరాదని ప్రవర్తించిన,నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అన్నారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వేణు గ్రామస్తులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# చదువులో ప్రతిభకు సైకిల్ కానుక

- 103 మంది విద్యార్థినులకు కోరమాండల్ సౌజన్యంతో
- కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ చేతుల మీదుగా అందజేత

**ములగాడ, పెన్ పవర్, ఆగస్టు 28 :** విద్యార్థినుల విద్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం, స్వావలంబనను ప్రోత్సహించే లక్ష్యంతో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా 103 మంది విద్యార్థి నులకు ఉచితంగా సైకిళ్లు, విద్యా సామగ్రిని పంపిణీ చేసింది. జీవీఎంసీ పరిధిలోని పశ్చిమ నియోజకవర్గం 58వ వార్డులోని కోరమాండల్ రిక్రియేషన్ సెంటర్‌లో శుక్రవారం ఈ కార్యక్రమా న్ని నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. జీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదు వుతూ తమ తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానా ల్లో నిలిచిన విద్యార్థినులను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశా రు. శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా, మింది, నడు పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు చెందిన విద్యార్థినులు సైకిళ్లను అందుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ.. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా మహిళలు, విద్యార్థులు, సమాజంలోని వివిధ వర్గాల సంక్షేమానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నా రు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ లభిస్తుందని పేర్కొన్నారు.

అనంతరం కోరమాండల్ ఉద్యోగిని అఖిల కలెక్టర్‌కు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోరమాండల్ హెడ్ ఆఫ్ మాన్యుఫ్యాక్చ రింగ్, సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఆర్. షణ్ముగం, హెచ్ఆర్ అండ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కేవీవీవైఎస్ నారాయణ, సీఎస్ఆర్ హెడ్ జయ్ గోపాల్, ఇతర ఉద్యోగు లు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.




## నూతన ఆస్పత్రిని సందర్శించిన డీసీహెచ్ఎస్

ఐదు రోజుల్లో కొత్త భవనంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 28 పెన్ పవర్.** మండలంలో గల భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అధికారి,డీసీహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు సందర్శించి ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు.ఆస్పత్రిలోని సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.రోగులకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విషయంపై ఆరా తీశారు.ఆస్పత్రికి సంబంధించిన మౌలిక వసతులు,విద్యుత్,నీరు, డ్రైనేజీ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,డాక్టర్ నాగభూషణరావు మాట్లాడుతూ,ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటుకు సంబంధించిన పనులను ఇప్పటికే ప్రారంభించామని,ప్రస్తుతం పాత ఆస్పత్రి నుంచి కొత్త భవనానికి వైద్య పరికరాలు,సామగ్రిని తరలించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.మరో ఐదు రోజుల్లో పాత ఆస్పత్రి నుంచి కొత్త భవనానికి అన్ని విభాగాలను పూర్తిగా మార్చే ప్రక్రియను పూర్తి చేస్తామని అంతేకాకుండా రెండు మూడు రోజుల్లో నూతన భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేలా మిగిలిన పనులను పూర్తి చేస్తామని డీసీహెచ్ఓ స్పష్టం చేశారు.రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని,తెలిపారు.ఆస్పత్రిలోని సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.డ్రైనేజీ,నీటి సౌకర్యం,జనరేటర్ తదితర మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.వైద్యాధికారి వెంట ఏపీ ఎంఎస్ఐడిసి,ఈ.ఈ భారతి.వున్నారు.

## తెదేపా కార్యాలయంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**గాజువాక:పెన్ పవర్,ఆగస్టు28** రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని గాజువాక తెలుగుదేశం కార్యాలయంలో బ్రహ్మకుమారిస్ లు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు కి రాఖీ కట్టి ఆశీర్వచనాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ సమాజంలో సోదరభావం,శాంతి పెంపొందించేలా దేశం మొత్తం రాఖీ పౌర్ణమి జరుపుకుంటున్నారని, మహిళల రక్షణ సాధికారత కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మహిళా కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డి దంపతుల పెళ్లిరోజు వేడుకలు




వైసీపీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేసిన వాసుపల్లి గణేష్‌కుమార్

**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 28 :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి, భారతి దంపతుల పెళ్లిరోజు వేడుకలను దక్షిణ ని యోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కేక్ కట్ చేసి జగన్‌మోహన్‌రెడ్డి, భారతి దంపతుల కు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితో పాటు పేద ప్రజల సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ఐదు కోట్ల ప్రజల ఆశీస్సులతో జగన్‌మో హన్‌రెడ్డి, భారతి దంపతులు సుఖసంతోషాలతో దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. శ్రీ కనకమహాలక్ష్మి, సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో భవిష్యత్తులోనూ పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి రావాలని కోరారు. ప్రస్తుతం అంధకారంలో ఉన్న ఆంధ్రప్రదే శ్‌కు మళ్లీ పండుగ రోజులు వస్తాయని, 2029 అసెంబ్లీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ తన సత్తా చాటుతుందని వాసుపల్లి గణేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు నీలపు సర్వేశ్వరరెడ్డి, దస్మాంతుల మాణిక్యాలరావు, దొడ్డి బాపు ఆనంద్, పిన్నింట్ల రాజారెడ్డి, ముజీబ్ ఖాన్, జిల్లా మత్స్యకార విభాగం అధ్యక్షుడు రాజు, రాష్ట్ర నాయకులు పత్చిరిపిల్లి రాము, మాజీ కార్పొరేటర్ పద్మనాభ అమ్మాజీ, పత్చిరిపిల్లి లక్ష్మి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి షబీరా బేగం, రాష్ట్ర అంగన్వాడీ వింగ్ జనరల్ సెక్రెటరీ సలాది భాను, దక్షిణ మహిళా విభాగం అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, దక్షిణ వాలంటరీ విభాగం అధ్యక్షురాలు కడవల నాగమణి, జిల్లా మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ నీలపు లక్ష్మి, వార్డు నాయకులు బురల చిన్న, అంబటి అప్పలరాజు, మాడుగుల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. వార్డు మహిళా అధ్యక్షులు చెలపల్లి జ్యోతి, రోజా, రమణి, గాలి పార్వతి, వలిశెట్టి లక్ష్మి, ఝాన్సీ, అన్నపూర్ణ నాయిర్, చుక్కా ఈశ్వరి, కోసేట్టి దేవి, మణి, మీనా, బుర్రలు అరుణ, జ్యోతి, మౌలే ష్‌తో పాటు దక్షిణ నియోజకవర్గ మహిళా నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## "జన్ మన్" ఇళ్ల నిర్మాణాలను "వేగవంతం" చెయ్యండి...!

- వారం రోజుల్లో పేమెంట్ అందిస్తాం...
- ఇళ్ల నిర్మాణాల పై స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ వెల్లడి...




**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 28:** మండల పరిధిలో ప్రారంభించిన జన్ మన్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని అలాంటి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన వారికి వారం రోజులలోగా పేమెంట్ అందించనున్నట్టు గృహ నిర్మాణ శాఖ స్పెషల్ ఆఫీసర్ వై. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బుదరాళ్ల పంచాయతీలో స్పెషల్ డ్రైవ్ లో భాగంగా శుక్రవారం పలువురు లబ్ధిదారులు వివిధ స్టేజిలో నిర్మించి ఏడాదిన్నరగా బిల్లులు రాక నిలిపేసిన జన్ మన్ ఇళ్ల ను స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ సందర్శించి తనిఖీ చేశారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వచ్చిన పలువురు లబ్ధిదారుల నూతన ఇళ్ల కు శంకుస్థాపన చేశారు.అనంతరం ఆయా గ్రామాల లబ్ధిదారులతో శ్రీనివాస్ మాట్లాడుతూ... కొత్త ఇళ్లు నిర్మాణాలు చేపట్టాలని కూటమి నాయకులు ఇప్పటికే ప్రోత్సహిస్తున్నారని అయితే ఇంతవరకు నిర్మించిన వాటికి పేమెంట్ లేదని చెప్పటంతో స్పెషల్ ఆఫీసర్ స్పందిస్తూ కొయ్యూరు , జి కే విధీ, చింతపల్లి మండలాల్లో సుమారు 3200 ఇళ్ల వరకు అసంపూర్తిగా నిర్మాణాలు చేపట్టి వదిలేశారని అన్నారు. వారం రోజుల్లో 1200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయుటకు లబ్ధిదారులు ముందుకు వచ్చినట్టు తెలిపారు.ఇకపై అలా ఉండదని ఏయే స్టేజిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా వాటికి వారం, పది రోజుల్లోగా పేమెంట్ మంజూరు చేస్తారని తెలిపారు.ఈ స్పెషల్ డ్రైవ్ జన్ మన్ ఇళ్ల నిర్మాణాల పరిశీలన లో ఏ ఈ దామోదర్ తో పాటు హౌసింగ్ శాఖ సిబ్బంది గోవింద్, ఇంజినీరింగ్ అసిటెంట్ గురుబాబు, బుదరాళ్ల పంచాయితీ కార్యదర్శి లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కనీస సౌకర్యాలు లేక ఎందుకు ఆర్భటంగా ప్రారంభించారు.

**గిరిజనులు పట్ల మంత్రి సంధ్యారాణి,ఎమ్మెల్యే జగదీశ్వరి కి సేవా భావం ఎందుకు లేదు.**

**మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి.**

**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 28 పెన్ పవర్.** భద్రగిరి హాస్పిటల్ లో కనీసం ఫ్యాన్స్ కూడ లేకపోవడం దౌర్భాగ్యం కురుపాం పరువు పోయేలా సెల్ ఫోన్ వెలుగులో చిన్నారికి వైద్యం చేయడం అన్యాయంఅని పుష్ప శ్రీవాణి మండిపడ్డారు. శుక్రవారం నాడు భద్రగిరిలో నూతనంగా ప్రారంభమైన ఆసుపత్రిను సందర్శించిన మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి పత్రిక విలేకరులతో మాట్లాడుతూ,శిలాఫలకం మీద పేరు ఉన్న శ్రద్ధ హాస్పిటల్ లో పూర్తిస్తాయి సౌకర్యాలు కల్పనకు ఎమ్మెల్యే,లోకల్ లీడర్లకు లేదు.గిరిజనులంటే కూటమి ప్రభుత్వానికి చులకన.హాస్పిటల్ ప్రారంభించి 20రోజులైనా కనీసం విద్యుత్ సౌకర్యం లేకపోవడం దౌర్భాగ్యంఅన్నారు. ఆసుపత్రి లో జనరేటర్ కూడ లేకపోవడంతో సెల్ టార్చ్ లైట్స్ వెలుగులో వైద్య సిబ్బంది వైద్యం చేయడం సిగ్గుచేటని అన్నారు.హాస్పిటల్ లో పూర్తిస్థాయిలో పనులు కాకపోయినా వ్యవసాయశాఖ మంత్రి అచ్చేన్నాయుడు అర్భటంగా ఎందుకు ప్రారంచారు.ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నాని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప కనీసం వసతులు కల్పించలేనప్పుడు ఎందుకు అంత అట్టహసంగా ప్రారంభించారని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని జీరో వేకెన్సీ పాలిసి ద్వారా హాస్పిటల్ కు మొత్తం స్టాఫ్ ను కూడ జగనన్న ప్రభుత్వంలో వేసాం పబ్లిసిటీ చేసే ముందు హాస్పిటల్ లో పూర్తిగా వసతులు ఉన్నాయా లేవా అని తెలుసుకోవాలని కలెక్టర్ కు ప్రశ్నించారు.రాజకీయ విమర్శలు మాని నియోజకవర్గం అభివృద్ధి పై ద్రుష్టి పెట్టాలని ఆమె హితవు పలికరు.ఆమె వెంట కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



# వైసీపీ ప్రచారాన్ని ఖండించిన జనసేన

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 28:** జీకే వీధిలో వైసీపీ నిర్వహించిన సమావేశంలో జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా వైసీపీలో చేరినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేయడాన్ని వంచుల పంచాయతీ జనసేన నాయకులు ఖండించారు.జనసేన నుంచి ఒక్క కార్యకర్త అయినా వైసీపీలో చేరినట్లు ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. నిజంగా చేరికలు జరిగితే వారి పేర్లు, గ్రామాలు, గతంలో పార్టీలో నిర్వహించిన బాధ్యతలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.వైసీపీకి చెందిన వారికే కొత్త కండువాలు కప్పి జనసేన నుంచి వచ్చినట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. గతంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు జనసేనలో చేరేందుకు ఆసక్తి చూపారని, జనసేన గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీ అవుతుందని వ్యాఖ్యానించారు.రానున్న ఎన్నికల్లో జనసేన ప్రభంజనం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శి పాంగి శ్రీను, యూత్ అధ్యక్షుడు వనపల ఈశ్వరరావు, మర్రి సూర్యనారాయణ, పాంగి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ సమావేశంపై టీడీపీ నేత బుజ్జిబాబు విమర్శలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగష్టు 28**:గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంపై దేవరాపల్లి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు సిరిబాల బుజ్జిబాబు విమర్శలు చేశారు.సమావేశంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ప్రకటించడం, వారికి పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో చేరినట్లు ప్రకటించిన కొంతమంది వ్యక్తులు గతంలో వివిధ కేసులకు సంబంధించి పోలీసుల విచారణను ఎదుర్కొన్నారని బుజ్జిబాబు ఆరోపించారు.అయితే సంబంధిత వ్యక్తులకు టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి పార్టీలతో ఎలాంటి అధికారిక సభ్యత్వ సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఇతర పార్టీలకు చెందిన వారిగా ప్రకటించడం సరికాదని విమర్శించారు.వైఎస్సార్‌సీపీలో ఉన్న కొంతమంది నాయకుల గత కార్యకలాపాలపై తమ వద్ద సమాచారం ఉందని, అవసరమైతే సంబంధిత వివరాలను ప్రజల ముందుంచుతామని బుజ్జిబాబు తెలిపారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆయన సవాల్ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పాడి శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీ మొట్టడం వీవీఎస్ఎన్ ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లకే రామారావు, సీనియర్ నాయకులు గడుతూరి పోతురాజు, సిరిబాల సంతోష్‌కుమార్, యువ నాయకులు వంతల గురుమూర్తి, శోభన్‌బాబు, దేవరాజు, దారబాబు తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌లో ప్రతిభ.. ఎస్టీ కేటగిరీలో రాష్ట్ర 14వ ర్యాంక్

- ఘనంగా సన్మానించిన వైసిపి నేత బొబ్బిలి లక్ష్మణ్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగష్టు 28**:అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం పెదబరడ గ్రామానికి చెందిన పాంగి ఆనంద్‌కుమార్ నీట్ పరీక్షలో 499 మార్కులు సాధించి ఎస్టీ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంక్ సాధించాడు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించి వైద్య విద్యలో సీటు పొందడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.పాంగి బాబూరావు మాస్టర్, దేవుడమ్మ దంపతుల కుమారుడైన ఆనంద్‌కుమార్ చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కష్టపడి చదివి నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ద్వారా వైద్య విద్యలో ప్రవేశం పొందడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్--ఉమామహేశ్వరి దేవి దంపతులు, కుటుంబ సభ్యులు ఆనంద్‌కుమార్‌ను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వైద్య రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## రాజ్మా విత్తనాలు 90% సబ్సిడీకిరైతులకు అందజేత.

- రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేసిన అరుకు ఏఎంసి వైస్ ఛైర్మన్ కంబిడి జ్ఞానప్రకాష్.




**హుకుంపేటపెన్ పవర్ ఆగష్టు 28 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం గూడ పంచాయతీ సచివాలయంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కంబిడి జ్ఞాన ప్రకాష్. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్మా పిక్కలకు బహిరంగ మార్కెట్లో మంచి గిరాకీ ఉందని కాబట్టి రైతులందరూ ఈ సబ్సిడీ విత్తనాలను. రైతులు సద్వినియోగం చేసుకొని తద్వారా మంచి ఆదాయాన్ని పొందాలని ఆయన అన్నారు అలాగే ప్రభుత్వ అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు మంచి దిగుబడిస్తాయని అగ్రికల్చర్ అధికారులు సలహాలు పాటిస్తూ వ్యవసాయం సాగిస్తే ఆర్థిక అభివృద్ధి కచ్చితంగా జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంబిడి సరోజినీకుమారి కోడ రాంబాబు మరియు వార్డ్ నెంబర్లు కిలో రాంబాబు పిసా సెక్రెటరీ పరుశురాం మరియు సచివాలయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు

## మిషన్ కనెక్ట్ పాడేరు రోడ్లపై సమగ్ర విచారణ జరపాలి




**వైసీపీ జిల్లా కోశాధికారి కుందేరి రామకృష్ణ డిమాండ్**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 28**:మిషన్ కనెక్ట్ పాడేరు పథకం కింద గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్డు పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని జీకే వీధి మండలం దామనపల్లి మాజీ సర్పంచి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి కుందేరి రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో మంజూరైన రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతపల్లి ఐటీడీఏ కాలనీ నుంచి భీమవరం గ్రామం వరకు మార్గంలో ఉన్న గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు గత ప్రభుత్వం రూ.80 లక్షలతో మెటల్ రోడ్డును మంజూరు చేసిందన్నారు. అయితే గుత్తేదారులు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో పనులు ఇప్పటికీ పూర్తికాలేదని ఆరోపించారు. దీంతో రహదారిని వినియోగించే పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రోడ్డు పనులకు సంబంధించి అక్కడక్కడా మెటీరియల్ వేసి బిల్లులు పొందేందుకు గుత్తేదారులు ప్రయత్నిస్తున్నారని, వారికి కొందరు అధికారులు సహకరిస్తున్నారని రామకృష్ణ ఆరోపించారు. మిషన్ కనెక్ట్ పాడేరు కింద జీకే వీధి మండలంలోని పలు పంచాయతీల్లో మంజూరైన రోడ్డు పనులు సైతం పూర్తికాలేదన్నారు.గతంలో నిర్వహించిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీలపైనా ఆయన ఆరోపణలు చేశారు. సంబంధిత అధికారులు, గుత్తేదారులతో కుమ్మక్కై తనిఖీలను తూతూమంత్రంగా నిర్వహించి, పనులు పూర్తయినట్లు నివేదికలు సమర్పించారని ఆరోపించారు.మిషన్ కనెక్ట్ పాడేరు కింద జీకే వీధి మండలంలో మంజూరైన అన్ని రోడ్డు పనులపై మరోసారి సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన కోరారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టినట్లు తేలితే సంబంధిత గుత్తేదారులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సోదరభావానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

**వాసుపల్లి కార్యాలయంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 28** :సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు నగరంలోని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు, అభిమానులు వాసుపల్లి గణేష్ కుమార్‌కు రాఖీ లు కట్టి రాఖీ పౌర్ణమి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భం గా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ.. మహిళల రక్షణ, సాధికారత కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని, సోదరభావం, ఐక్యతను మరింత పెంపొంది స్తుందని అన్నారు. మహిళలు తమ అభిమానాన్ని రాఖీలు కట్టి చాటుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.వేడుకల్లో భాగంగా మహిళా నాయకులు, కార్యకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్‌కు రాఖీలు కట్టి హారతులు ఇచ్చి శు భాకాంక్షలు తెలి పారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పద్మనాభ అమ్మాజీ, పత్చిరిపిల్లి లక్ష్మి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ షబీరా బేగం, రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ జనరల్ సెక్రటరీ సలా ది భాను, దక్షిణ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగార మ్మ, దక్షిణ వాలంటరీ విభాగం అధ్యక్షురాలు కడవల నాగమ ణి, జిల్లా మహిళా విభాగం జనరల్ సెక్రటరీ నీలపు లక్ష్మి, వా ర్డు మహిళా అధ్యక్షులు చెలపల్లి జ్యోతి, రోజా, రమణి, గాలి పార్వతి, వలిశెట్టి లక్ష్మి, ఝాన్సీ, అన్నపూర్ణ నాయర్, చుక్కా ఈశ్వరి, కోసేట్టి దేవి, మణి, మీనా, బుర్రలు అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## డింగిరాయికి తాగునీటి కష్టాలకు .. త్వరలో పరిష్కారం

**ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ బాబు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్,ఆగస్టు 28:**మండలంలోని సంకాడ పంచాయతీ పరిధి డింగిరాయి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో గత కొంతకాలంగా తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్‌తో కలిసి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు శుక్రవారం గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామస్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాకు ఆటంకంగా ఉన్న లో-వోల్టేజీ సమస్యను గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జేఈ కళ్యాణ్ రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌లో గ్రామస్థులు సమర్పించిన అర్జీలకు సంబంధించి పెదజడుమూరు గ్రామంలో గ్రావిటీ నీటి పథకం నిర్మాణానికి అవసరమైన ప్రాంతాన్ని పరిశీలించారు. సాంకేతికంగా పరిశీలించి అంచనాలు రూపొందించి, నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొట్టడం నూకరాజు, యూనిట్ ఇన్‌చార్జి మామిడి చంటిబాబు, నాయకులు లోత గంగరాజు, కాకూరు చిన్నకేశవ, దేశగిరి సంజీవరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కితాబులో ప్రబలిన జ్వరాలు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహణ.

**టీడీపీ ఇంచార్జి సత్యనారాయణ చొరవతో ప్రత్యేక వైద్య సేవలు.**



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 28:** వారం రోజులుగా వాతావరణంలో మార్పులతో తీవ్ర జ్వరాలు ప్రబలి పలువురు ఆదివాసీలు బాధపడుతున్న సమాచారంపై స్పందించిన వెలగలపాలెం పంచాయితీ టీడీపీ ఇంచార్జి మాజీ సర్పంచ్ భర్త ఇడవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో కితాబు లో శుక్రవారం ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయించారు.ఈ మేరకు ఇక్కడ మూడు రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేయించి జ్వరాలున్న వారికి మందులు పంపిణీ చేశారు. చిన్నపిల్లల గురించి వాతావరణం లో జాగ్రతలు పాటించాలని వైద్య సిబ్బంది ఏం ఎల్ హెచ్ పి లలిత, ఏ ఎన్ ఎం మాధవి హెల్త్ అసిస్టెంట్ చంద్రరావు లు సూచించారు. గ్రామాల్లో పరిశు భ్రత పాటించాలని, కాచిన ఆహారాన్ని, వేడి నీళ్లనే తాగాలని గ్రామస్తులకు సూచించారు. అలాగే గ్రామాల్లో బాల్య వివాహాలను ప్రోత్సహించటం కాని, జరపటం చేయరాదని అలా చేస్తే చట్టరీత్య నేరం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బందితో పాటు స్థానిక వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, గ్రామ సభ్యులు కొండలరావు,ప్రభాకర్ ఈ మెడికల్ క్యాంపు నిర్వహించటం వల్ల వారంతా సంతృప్తి చెందుతూ వారు ఆనందం వ్యక్తం చేశారు.

## వైసీపీ నేతలు డ్రామాలు మానుకోవాలి

**తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు**




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 28**:వైసీపీ నేతలు వాస్తవాలను పక్కనపెట్టి అవాస్తవాలను ప్రచారం చేస్తూ రాజకీయ డ్రామాలకు తెరతీయడం సిగ్గుచేటని కూటమి నేతలు విమర్శించారు. గురువారం కొత్తవీధి మండల కేంద్రంలో జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు చేసిన వ్యాఖ్యలపై వారు స్పందించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేకు ప్రజల సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో వాటిని ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.వైసీపీ కార్యకర్తలకు కండువాలు కప్పి వారిని టీడీపీ, జనసేన నుంచి వైసీపీలో చేరినట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. వంచుల, దారకొండ, దేవరపల్లి పంచాయతీలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలేనని, వారిని కూటమి పార్టీల నుంచి వచ్చినట్లు చూపించడం తగదని పేర్కొన్నారు.గతంలోనూ 1/70 చట్టం, బాక్సైట్ అంశాలపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారాలు చేశారని ఆరోపించారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు, రాజకీయ డ్రామాలు మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ చేస్తున్న ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని కూటమి నేతలు పేర్కొన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు,జనసేన మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు,బీజేపీ మండల అధ్యక్షుడు కాకూరి శేఖర్ మాజీ జెడ్పీటీసీ నళిని కృష్ణ, సీనియర్ నాయకులు వండలం బాలయ్య, కాకూరి వెంకటరమణ, గబులంగి నాగేశ్వరరావు, పాంగి కృష్ణ,బీజేపీ సీనియర్ నాయకుడు బోండ్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# జ్వరాల ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి...!

**పాడేరు జిల్లా మలేరియా అధికారిణి తులసి సందర్శన.**

**కాట్రగెడ్డ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించిన డి ఎం ఓ .**

**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 28:** వాతావరణంలో మార్పులతో సీజనల్ గా వచ్చే సాధారణ జ్వరాలతో పాటు మలేరియా,డయోరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పాడేరు జిల్లా మలేరియా అధికారిణి తులసి అన్నారు. మండలంలోని రాజేంద్రపాలెం పి హెచ్ సి నడింపాలెం సచివాలయ పరిధిలో ఉన్న కాట్రగెడ్డ గ్రామాన్ని డి ఎం ఓ తులసి శుక్రవారం సందర్శించారు. ఇక్కడ గ్రామంలో అన్ని వీధిలలో తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇక్కడ ఉన్న జనాభా , ఆరోగ్య పరిస్థితులపై హెల్త్ అసిస్టెంట్ ను వివరాలు అడిగి తెలుసుకునీ రికార్డులను పరిశీలించారు. మహిళాలతో డి ఎం ఓ మాట్లాడి జ్వరాలు ప్రబలే అవకాశంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.గ్రామంలో ఎక్కడా జ్వరాలు లేవని గ్రామస్తులు తెలిపారు. అన్ని ఇళ్ల ను చెక్ చేశారు.ఈ డి ఎం ఓ తులసి సందర్శన లో సబ్ యూనిట్ అధికారి నూకరాజు, నీలకంఠం, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, చిట్టిబాబు, చింతపల్లి సబ్ యూనిట్ అధికారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.



# శ్రావణ శోభలో కన్యకాపరమేశ్వరి

- 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక నివేదన
- మహిళలచే శ్రీమహాలక్ష్మి దేవికి లక్ష్మీసహస్రనామ కుంకుమార్చన

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 28 :** వన్‌టౌన్: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా వన్‌టౌన్ కురుపాం మార్కెట్ ప్రాంతంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మూడవ శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్ర మాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారు పుష్ప వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అమ్మవారిని బాలాలయంలో కొలువుదీర్చి ఉదయం 6 గంటలకు ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ తో పాటు వివిధ రకాల పండ్ల రసాలతో సహా 108 ద్రవ్యాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో పుష్ప వస్త్రా లంకరణ చేశారు. 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక నివేదన సమర్పించారు.అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించినట్లు దేవాలయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్, పెనుగొండ వెంకట కామరాజు తెలిపారు.


మహిళలచే లక్ష్మీసహస్రనామ కుంకుమార్చన దేవాలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం దేవస్థాన ఆస్థాన పురోహితులు శ్రీ ఆర్.బి.బి. కుమారశర్మ ఆధ్వ ర్యంలో శ్రీమహాలక్ష్మి దేవికి మహిళలచే సామూహిక లక్ష్మీసహ స్రనామ కుంకుమార్చన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శ్రావణమాస ఉత్సవ కార్యనిర్వాహక సభ్యురాళ్లు కడిమిశెట్టి దంతేశ్వరి, కొత్తా లక్ష్మి, కొత్తా ఉమామ హేశ్వరి, కట్టమూరి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు, సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు దేవస్థాన సంఘ కోశాధికారి దోమ వెంకట బాలాజీ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు.




## శ్రావణ లక్ష్మి పూజలకు భక్తుల విశేష స్పందన




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 28 :**శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఆగస్టు 13వ తేదీన ప్రారంభమైన శ్రావణ లక్ష్మి పూజలు శు క్రవారం భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. శుక్రవారం సందర్భంగా పూజా కార్యక్రమాలను రెండు విడతలుగా నిర్వహించారు.మొదటి విడత పూజలు ఉదయం 8 గంటలకు ప్రారంభం కాగా, 55 మంది ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెండో విడతలో మరో 45 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. దీంతో రెండు విడతల్లో మొత్తం 100 మంది ఉభయదాతలు శ్రావణ లక్ష్మి పూజల్లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు ఎం.వి. రమణ, ఏఈ కే.ఎస్.ఎన్. మూర్తి, వేద పండితులు, అర్చకులు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ముత్యాలమ్మ అమ్మవారి శ్రావణమాసం పౌర్ణమి సందర్భముగా మహిళా భక్తులచే సామూహిక వరలక్ష్మీ వ్రతములు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 28.**శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం ముత్యాలాంబపురం నందు ఈరోజు శ్రావణమాసం పౌర్ణమి సందర్భముగా మహిళా భక్తులచే సామూహిక వరలక్ష్మీ వ్రతములు ధర్మకర్తల మండల చైర్మన్ శ్రీ అన్నం నీడి శ్రీనివాసరావు మరియు ధర్మకర్తల మండల సభ్యులు ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి పి హరే రామ ప్రసాద్ పర్యవేక్షణలో గ్రామస్తులు భక్తులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది మహిళా భక్తులు పాల్గొని ముత్యాలమ్మ అమ్మవారికి వరలక్ష్మీ వ్రతములు నోచుకున్నారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కార్య నిర్వహణ అధికారి వారిచే రాగి రూపు లు పూజకు అందించడం జరిగినది విశేష పూజలు వ్రతములు అనంతరం వ్రతముల్లో పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాదము ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలో అన్నం నీడి శ్రీనివాసరావు, మాకా శ్రీరామ్, యలమర్తి వీర్రాజు ,మానే సత్య కూటమి టమి నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేయాలంటే భయపడేలా తీర్పు ఇచ్చిన న్యాయస్థానం.!

**గంజాయి రవాణా కేసులో ఇద్దరు నిందితులకు 10 సంవత్సరాల జైలు శిక్ష.**

**హుకుంపేట పెన్ పవర్ ఆగస్టు 27 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం 435 కిలోల గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు 10 సంవత్సరాల జైలు శిక్ష విధించారని 9వ అదనపు జిల్లా మరియు న్యాయస్థానం శుక్రవారం తీర్పు ఇచ్చింది అంతేకాకుండా. దాంతోపాటు లక్ష రూపాయలు జరిమాను కూడా విధించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 435 కిలోల గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో ఏ 2, ఏ 3 నిందితులకు చెరో 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి అక్షరాల లక్ష రూపాయల జరిమానా విధించినట్లు ఎస్పీ అమిత్ బర్దార్. ఐపిఎస్ విలేకరుల. సమావేశంలో తెలిపారు

కేసు వివరాలు

2016 జనవరి 19న మధ్యాహ్నం 1 గంట సమయంలో పెదబయలు నుంచి కృష్ణా జిల్లా వైపు ఈచర్ వ్యాన్ నంబర్ ఏ పి 16 టీ ఏ 1279లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు హుకుంపేట పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. అప్పటి హుకుంపేట ఎస్‌హెచ్ఓ ఎన్. రవికుమార్ మరియు సిబ్బంది, మధ్యవర్తులతో కలిసి కోట్నాపల్లి గ్రామం వద్ద వాహనాన్ని తనిఖీ చేయగా ఏ 2 యెలగాల నాగేశ్వరరావు, ఏ 3 ధర్మరాజు పట్టుబడ్డారు.

వారి వద్ద ఉన్న దాదాపు 20 గోనె సంచుల్లో మొత్తం 435 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హుకుంపేట పోలీస్ స్టేషన్‌లో క్రైం నం.03/2016, యూ / ఎస్ 20(బి )(ఖఖ)(సి ) ఎన్ డి పి సి యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఏ 2, ఏ 3లను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో ఏ 1 వడ్డేపూడి కోటయ్య ముందస్తు బెయిల్ పొంది న్యాయస్థానం ఎదుట లొంగిపోయాడు. ఈ కేసులో అప్పటి ఎస్ఐ ఎన్. రవికుమార్ చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో ఎంఈఓ, సర్పంచ్, వీఆర్వో , పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ తదితర సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసులో ఇన్వెంటరీ అధికారిగా పనిచేసిన ఎస్ఐ ఎన్. నాగకార్తిక్ కూడా కోర్టులో సాక్షిగా హాజరై స్వాధీనం చేసుకున్న గంజాయి మరియు ఇన్వెంటరీ ప్రక్రియకు సంబంధించిన వివరాలను సమర్పించారు.

ఈ కేసులో చోడవరం కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ పోలీసుల తరపున కేసును సమర్థవంతంగా వాదించారు.



పోలీసుల దర్యాప్తు ద్వారా సేకరించిన సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందు సమర్థవంతంగా ప్రవేశపెట్టడంతో ఏ 2, ఏ 3లపై నేరం రుజువు అయింది

దీంతో గౌరవ 9వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయస్థానం ఏ 2, ఏ 3లకు చెరో పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి అక్షరాల లక్ష జరిమానా విధించింది.

గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు నిరంతరం కఠిన చర్యలు చేపడుతున్నారని జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, ఐపీఎస్. తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## గృహ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం



పీఎం జన్మన్ రెండో విడత గృహ నిర్మాణానికి ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు శంకుస్థాపన.

జర్రెల పంచాయితీ మాజీ సర్పంచ్ నాయకం భాగ్యవతి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 28.**మండలంలోని జర్రేల గ్రామ పంచాయితీ కేంద్రంలో రెండో విడత పిఎం జన్మన్ గృహ నిర్మాణానికి భూమీ పూజ కార్యక్రమం నిర్వహించినట్లు జర్రెల పంచాయితీ మాజీ సర్పంచ్ నాయకం భాగ్యవతి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమే మాట్లాడుతూ.. పీఎం జన్మన్ రెండో విడత గృహాల నిర్మాణానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ధర్మారావు, హౌసింగ్ డీఈఈ చిట్టపుల్లి కృష్ణ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ నాగేంద్రలతో కలిసి కొబ్బరికాయలు కొట్టి భూమీ పూజ కార్యక్రమం నిర్వహించమన్నారు. కొన్ని కారణాలు వల్ల బిల్లు ఆగిందని, ప్రస్తుతం హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లు ప్రభుత్వం చెల్లిస్తుందని, కొత్తగా మంజూరైన గృహాలను లబ్ధిదారులు నిర్మించుకోవాలని హౌసింగ్ అధికారులు తెలిపినట్లు భాగ్యవతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి, పెసా అధ్యక్షులు సుందర్ రావుతో పాటు పరశురాం, ప్రభాకర్, కార్తీక్, బుద్దు, డోంబ్రు, భగీరథి తదితరులు పాల్గొన్నారు.

## పలువురు నాయకులకు రాఖీ కట్టిన ప్రభుత్వ విప్.

**గుమ్మలక్ష్మీపురం ఆగష్టు 28 పెన్ పవర్.**రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి శుక్రవారం నాడు ఆత్మీయతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణతో పాటు పలువురికి ఎమ్మెల్యే రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోదరభావంతో రాఖీలు కట్టడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## గిరిజన గురుకుల విద్యార్థుల తరలింపు తక్షణమే ఆపాలి.

- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు వద్దు.
- దళిత సంక్షేమ సంఘం డిమాండ్.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 28.**

మారికవలస గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఇతర ప్రాంతాలకు తరలించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చింతపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మారికవలసలో ఇప్పటికే వందలాది మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్న గురుకుల పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని, వ్యతిరేకించడం లేదని, అయితే అందుకోసం ప్రస్తుతం ఉన్న గురుకుల పాఠశాలను మూసివేయడం లేదా విద్యార్థులను ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదన్నారు.

విద్యార్థుల విద్యాభ్యాసం, వసతి, భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. అవసరమైతే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ భవనం లేదా అదనపు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు, గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులతో సంప్రదించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

ఈ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పిచ్చయ్య హెచ్చరించారు.

## మన్యంలో ఆగని విద్యార్థుల మరణాలు.

- యాజమాన్యాల నిర్లక్ష్యంతో బలైపోతున్న పసిప్రాణాలు.
- కడుపుకోతతో తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 28.**అల్లూరిజిల్లా, గిరిజన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు ఆగడం లేదని, పాఠశాల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా అమాయక గిరిజన విద్యార్థులు నిండు ప్రాణాలు కోల్పోతున్నారని జై భీమ్ హెల్పర్ అసోసియేషన్ అల్లూరిజిల్లా ప్రెసిడెంట్ వి. పరమేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జీకే వీధి మండలం ఏకలవ్య పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న బాలుడు మలేరియా జ్వరంతో బాధపడుతూ మృతి చెందడం పై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

విద్యాసంస్థల్లో సరైన భద్రతా ప్రమాణాలు, వసతి సౌకర్యాలులేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని

ఆయన అన్నారు. తమ పిల్లలను చదువుల కోసం పంపితే విగతజీవులుగా తిరిగి వస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులకు తీవ్ర గర్భశోకం మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

# విద్యుత్తు వినియోగదారుల సమస్యలకు తక్షణ పరిష్కారం.




**బాధితులకు 22.16 లక్షల రూపాయల పంపిణీ**

**సి జి ఆర్ ఎఫ్ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డాక్టర్. సత్యనారాయణ.**


**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 28.** విద్యుత్ వినియోగదారుల సమస్యలను సిజిఆర్ఎఫ్ ( విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కా న్యాయస్థానం ) తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డాక్టర్. బి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిజిఆర్ఎఫ్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్మన్ రిటైర్డ్ న్యాయమూర్తి విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి 17 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా చైర్మన్ విశ్రాంతి న్యాయమూర్తి మాట్లాడుతూ భారత విద్యుత్ చట్టం 2003 ప్రకారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థను 2005 జనవరిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు విద్యుత్ సమస్యలను ప్రాంతీయ విద్యుత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ స్థాయి సిబ్బందికి లేదా ఇతర సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేసుకోవచ్చని అన్నారు. స్థానికంగా విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం జరగకపోతే ఈ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చున్నారు. బిల్డింగులు లో లోపాలు విద్యుత్ తీగల మరమ్మత్తులు ట్రాన్స్ఫార్మర్ల మరమ్మత్తులు మీటర్లు కాలిపోవడం ఓల్టేజీలో హెచ్చుతగ్గులు విద్యుత్ మీటర్ల లోపాలు కొత్త విద్యుత్ కనెక్షన్ మంజూరు యజమాని పేరు కేటగిరి మార్పు విద్యుత్ వినియోగదారుల బిల్లుల లోపాలు సరి చేయడం తొలగించబడిన విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించడం తదితర సమస్యలను న్యాయస్థానం తక్షణమే పరిష్కారం చూపుతుందన్నారు. విద్యుత్ పంపిణీలు నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది 616 ఫిర్యాదులు వచ్చాయని అందులో 446 పరిష్కరించామని ఇంకా 177 పెండింగ్లో ఉన్నాయన్నారు. అలాగే పరిహారం రూపంలో బాధితులకు 22.16 లక్షల రూపాయలు చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు ఎస్ రాజబాబు, ఆర్థిక సభ్యుడు ఎస్ సుబ్బారావు, స్వతంత్ర సభ్యుడు ఎన్ మురళీకృష్ణ, స్థానిక ఏపీ డి పి సి ఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. పాత్రుడు, ఏడి కే. సన్నీ రాంబాబు, జి మాడుగుల ఎం.వి.రమణ, చింతపల్లి ఏఈ ఎం వెంకటేశ్వరరావు, కొయ్యూరు ఏ ఈ ఈ నాగ సతీష్, జీకే వీధి ఏఈ సూరిబాబు, జేఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లు సిద్ధం. ఎంపీడీవో కుమార్.



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు28**: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గుర్తించిన పోలింగ్ స్టేషన్లపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదని, అడ్డతీగల ఎంపీడీవో ఏవివి కుమార్ తెలిపారు. అడ్డతీగల మండలంలోని 22 పంచాయతీలకు 202 పోలింగ్ స్టేషన్లను గుర్తించి, ఈనెల 26న ఆయా పంచాయతీలలో ఓటర్లకు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీవో తెలిపారు. ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో తదుపరి చర్యల నిమిత్తం, వివరాలను జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేసినట్లు ఎంపీడీవో కుమార్ తెలిపారు.

# పి 4 అమలు పై ప్రజాప్రతినిధులు, అధికారులు, సమన్వయంతో పనిచేయాలి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 28:**
రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విజన్ యూనిట్లు పి 4" కార్యక్రమంపై ముఖ్య మంత్రి నారా చంద్రబా బు నాయుడు అధ్యక్ష తన జిల్లా ఇన్చార్జి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో రూరల్ మండల పరిషత్ కార్యాలయం నందు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

సమావేశంలో విజన్ యూనిట్లు పి4 అమలుపై ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు వాటి ప్రయోజనాలు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు.అర్హులైన కుటుంబాలను గుర్తించి, వారికి అవసరమైన సహాయం, అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ విజన్ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో, సమన్వ యంతో పనిచేయాలని నిర్ణయించారు.

ఈకార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, డి ఆర్ ఓ భాస్కర్ రెడ్డి, ఎం పి డి ఓ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో బొడ్డు అమ్మిరాజు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నియోజకవర్గంలోని అన్ని విజన్ టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.


# నన్నయ యూనివర్సిటీ తో ఇండియన్ కాంక్రీట్ ఇన్స్టిట్యూట్ ఎంవోయూ



**పెన్ పవర్, ఆగస్టు 28:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ , ఇండియన్ కాంక్రీట్ ఇన్స్టిట్యూట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. విశ్వవిద్యా లయంలో వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ అధ్యక్షతన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె వి స్వామి, ఇండియన్ కాంక్రీట్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డా. కె. వెంకట నరసింహా రావు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకు న్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇండియన్ కాంక్రీట్ ఇన్స్టిట్యూట్ సెంటర్ తో ఎంవోయూ కుదరడం ఆనందంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యా కార్యక్రమాలు, విద్యార్థులకు ఇంటర్న్ షిప్ లు, నైపుణ్యా భివృద్ధి , ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు కల్పించేందుకు ఈ ఎంవోయూ ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లోని మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంవోయూతో ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.క్యూ.ఎ.సి. కోఆర్డినేటర్ డా.వి.పెర్సిస్, డీన్ అకడమిక్ అఫైర్స్ డా.కె.రమణేశ్వరి, ప్రిన్సిపాల్స్ బి.కెజియారాణి, డి.జ్యోతిర్మయి, డి.కళ్యాణి, కె.సుబ్బారావు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల భవిష్యతుతో ప్రభుత్వం చెలగాటం

- **మారికవలస గురుకులాన్ని ఖాళీ చేయించిన ప్రభుత్వం వెనుక ఉద్దేశం ఏమిటి?**
- **అర్ధరాత్రి విద్యార్థుల తరలింపుపై సమగ్ర విచారణ జరపాలి.**
- **బాధ్యులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలి.**
- **ఎన్ హెచ్ ఆర్ సి, గవర్నర్, ఎస్సీ/ఎస్టీ కమిషన్లు తక్షణమే జోక్యం చేసుకోవాలి.**
- **ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం.**




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 28.** గిరిజన విద్యార్థుల భవిష్యతుతో ప్రభుత్వం చెలగాటం మాడుతుందని, మారికవలసలో సుమారు 22 ఏళ్లుగా కొనసాగుతున్న గిరిజన గురుకుల పాఠశాలను అర్ధరాత్రి వేళ ఖాళీ చేయించి, సుమారు 480 మంది గిరిజన విద్యార్థులను తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం లేకుండా తరలించారనే ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఆదివాసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం డిమాండ్ చేశారు. విద్యార్థులను రాత్రివేళ పోలీసు బలగాల సమక్షంలో తరలించడం వల్ల వారిలో భయాందోళనలు, మానసిక ఒత్తిడి ఏర్పడే పరిస్థితి నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత, విద్యా హక్కులు, తల్లిదండ్రుల ఆందోళనలను ప్రభుత్వం ప్రాధాన్యంగా పరిగణించాలని కోరారు. చదువుకుంటున్న గిరిజన విద్యార్థులను అర్ధరాత్రి వేళ ఎందుకు తరలించాల్సి వచ్చిందో ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని నీలకంఠం ప్రశ్నించారు. ఈ తరలింపునకు ఆదేశాలు ఇచ్చిన అధికారులు ఎవరు? ఏ ఉత్తర్వుల ఆధారంగా చర్యలు తీసుకున్నారు? తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం ఎందుకు ఇవ్వలేదు? అనే అంశాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన సీసీ టీవీ దృశ్యాలు, విద్యార్థుల తరలింపునకు ఉపయోగించిన వాహనాల రికార్డులు, సంబంధిత ఉత్తర్వులు, హాజరు వివరాలు భద్రపరచి స్వతంత్ర విచారణలో భాగంగా పరిశీలించాలని కోరారు.

**' సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' పేరుతో ఉన్న గురుకులాన్ని బలహీనపరచవద్దు**

'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించే ప్రతి చర్యను స్వాగతిస్తామని నీలకంఠం స్పష్టం చేశారు. అయితే కొత్త భవనాలు, అవసరమైన మౌలిక వసతులు, తగిన నిధులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తిగా కల్పించకుండానే ఇప్పటికే కొనసాగుతున్న గురుకులాన్ని ఖాళీ చేయించడం ఎందుకని ప్రశ్నించారు. 22 ఏళ్ల చరిత్ర కలిగిన విద్యాసంస్థను తొలగించడం లేదా బలహీనపరచడం అభివృద్ధి కాదని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. 480 మంది గిరిజన విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా తక్షణమే తగిన, సురక్షితమైన వసతి--విద్యా సదుపాయాలు కల్పించాలని, 22 ఏళ్ల చరిత్ర కలిగిన మారికవలస గురుకుల పాఠశాల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలన్నారు. విద్యార్థులను అర్ధరాత్రి తరలించిన ఘటనపై స్వతంత్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని నిబంధనలు వర్తిస్తాయా అనే అంశాన్ని పరిశీలించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలనీ, ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, గవర్నర్, సంబంధిత ఎస్సీ/ఎస్టీ కమిషన్లు తక్షణమే జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలన్నారు. మారికవలస గురుకుల పాఠశాల, 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, నిర్ణయాలు, భవిష్యత్ కార్యాచరణపై శ్వేతపత్రం విడుదల చేయాలనీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని, గిరిజన విద్యార్థుల విద్యా హక్కులు, భద్రత, భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకోబోమని నీలకంఠం హెచ్చరించారు. విద్యార్థుల సమస్యకు న్యాయమైన పరిష్కారం లభించే వరకు ఆదివాసి కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు.

# ఏకలవ్య విద్యార్థి మృతిపై వైద్యాధికారుల విచారణ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 28** : స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న పి. దినేష్‌కుమార్ (12) మృతిపై జిల్లా వైద్య, మలేరియా నివారణ అధికారులు గురువారం పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి తులసి, సబ్‌యూనిట్ అధికారులు చిట్టిబాబు, నీలకంఠంనాయుడు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ ఎం. శ్రావణి తదితరులు పాఠశాల పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల వృద్ధిని అరికట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు నిద్రించే సమయంలో తప్పనిసరిగా దోమతెరలు వినియోగించేలా చూడాలన్నారు. విద్యార్థులకు గోరువెచ్చని తాగునీటిని మాత్రమే అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం, భద్రత విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు జీకేవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యాధికారి డాక్టర్ శివరామ్‌తో సమావేశమై స్థానికంగా జ్వరాల పరిస్థితి, అందుతున్న వైద్య సేవలు, మలేరియా నివారణకు చేపడుతున్న చర్యలపై చర్చించారు.

# మెరుగైన విద్యను కోరుకోవడం నేరమా?

- **మారికవలస 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' విద్యార్థుల తరలింపుపై సర్వత్రా ఆగ్రహం**
- **ప్రభుత్వ తీరుపై ఆవేదన వ్యక్తం చేసిన పూర్వ విద్యార్థిని శ్రీలేఖ పడాల్**



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 28.** నాణ్యమైన విద్య కోసం మైదాన ప్రాంతాలకు వచ్చిన గిరిజన విద్యార్థులను ఉన్నఫళంగా బలవంతంగా తరలించడం వారి భవితతో చెలగాటం ఆడటమేనని చింతపల్లికి చెందిన మారికవలస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పూర్వ విద్యార్థిని బోనంగి శ్రీలేఖ పడాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ చర్యల పట్ల అధికారులు అనుసరిస్తున్న తీరు దారుణంగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు ఉన్నప్పటికీ, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్య కోసం గిరిజన విద్యార్థులు మారికవలసలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (బాయ్స్, గర్ల్స్) వైపు మొగ్గుచూపుతారు. ఇక్కడ కఠినమైన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధిస్తేనే సీటు దక్కుతుంది. ఏజెన్సీకి, మైదాన ప్రాంతానికి మధ్య ఉండే వాతావరణ వ్యత్యాసాలను తట్టుకుని, ఎంతో కష్టపడి ఇక్కడి చదువులకు అలవాటు పడిన పిల్లలను ఇప్పుడు బలవంతంగా తరలించడం వారిని మానసికంగా తీవ్ర గందరగోళానికి గురిచేస్తోందని శ్రీలేఖ విచారం వ్యక్తం చేశారు. 2018 నుంచి 2022 వరకు తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, సబ్జెక్టులపై పూర్తి పట్టు సాధించడానికి, చదువుపై ఆసక్తి పెరగడానికి ఈ వాతావరణం ఎంతో దోహదపడుతుందని ఆమె గుర్తుచేశారు. తమను ఇక్కడి నుంచి తరలించవద్దంటూ గత మూడు రోజులుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఆందోళనలు చేస్తున్నా.. గిరిజనులకు అండగా నిలవాల్సిన ఐటీడీఏ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత వెనుకబడిన పీవీటీజీ, ఆదిమ గిరిజన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతో గతంలో ప్రవేశపెట్టిన 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' విధానాన్ని ప్రభుత్వాలు ఇప్పటికే ఎత్తివేశాయి. ఒక పక్క ఆ పథకాన్ని రద్దు చేసి, మరోపక్క ఇప్పుడు అద్భుతమైన విద్యను అందిస్తున్న 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' నుంచి గిరిజన బిడ్డలను దూరం చేస్తే.. వారు ఉన్నత చదువులు ఎలా చదవగలరని శ్రీలేఖ ప్రభుత్వాన్ని నిలదీశారు. అధికారులు తక్షణమే స్పందించి, బలవంతపు తరలింపును ఆపి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## కాన్పు కష్టం అన్నారు.. 108 అంబులెన్సులో సుఖ ప్రసవం



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగష్టు 28:**కాన్పు కష్టం అవుతుందని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసిన గర్భిణికి మార్గమధ్యలోనే 108 అంబులెన్సులో సుఖ ప్రసవం జరిగింది. ఉంగుటూరు 108 అంబులెన్సు సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించి ప్రసవం చేయించారు.

ఉప్పులూరుకు చెందిన షకిన రాణి మూడో కాన్పు కోసం పురిటి నొప్పులతో చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. నెలలు నిండడంతో పరీక్షించిన వైద్యులు కాన్పు కష్టమయ్యే అవకాశం ఉందని భావించి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

108 అంబులెన్సులో ఏలూరు తరలిస్తుండగా ఏలూరు సమీపానికి చేరుకునే సమయంలో గర్భిణికి ప్రసవం జరిగింది. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

ప్రసవ సమయంలో సకాలంలో సహకరించి తల్లి, బిడ్డను సురక్షితంగా కాపాడిన 108 టెక్నీషియన్ అనిల్ కుమార్, పైలెట్ రామారావులను పేషెంట్ బంధువులు అభినందించారు.

## గ్రామపంచాయతీ ఎన్నికలు పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ



**వై రామవరం, పెన్ పవర్, ఆగష్టు 28**: వై రామవరం, గుర్తేడు మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తుది జాబితా ఆయా పంచాయతీలలో ప్రచురించడం జరిగిందని మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

పంచాయతీ సాధారణ ఎన్నికల నిమిత్తం పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురించి ప్రజల నుండి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఏ విధమైన అభ్యంతరాలు రాకపోవడంతో పోలింగ్ కేంద్రాల తుది జాబితా గ్రామ పంచాయితీలలో, ఎంపీడీవో ఆఫీసులో ప్రచురించడం జరిగిందని తెలిపారు. వై రామవరం మండలంలో 102 పోలింగ్ కేంద్రాలు, గుర్తేడు మండలంలో 52 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## హెచ్ఆర్‌పీఏసీఐ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన

**రాజ మహేంద్రవరం, పెన్ పవర్, ఆగష్టు 28:**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని "హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ అవేర్నెస్ కౌన్సిల్ అఫ్ ఇండియా" ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.పరిశుభ్రమైన పర్యావరణం ప్రతి మనిషి హక్కు అనే సందేశంతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందిం చడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు సత్య గుమ్మాపు సభ్యులు మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ కాలుష్యం వల్ల మానవ ఆరోగ్యం, జీవ వైవిధ్యం, భవిష్యత్ తరాలపై పడే ప్రభావాలను వివరించి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా తగరం సురేష్ బాబు ఉచితంగా మొక్కలు అందచేయడం జరిగింది.సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ కే ఎం జగదీష్ మొక్కని అందచేసిస్థానిక బాబా నగర్ లో మొక్కని నాటి దాని భాధ్యత, సంరక్షణ ని చూడాలని జగదీష్ తొ ప్రతిజ్ఞ చేయంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో , డాక్టర్ కె ఎం జగదీష్, బిందు చౌదరి, కొమ్మిరెడ్డి ప్రభావతి, పిచ్చుక మహేష్, పగడాల కిషోర్, గొల్లవెల్లి శ్రీనివాస్, గుంటూరు రమణ, జొన్నకూటి వర్ధన్ కుమార్, ఎరువ మీనాక్షి తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతును తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం తీసుకువస్తాయని అభిప్రాయపడ్డారు.

# అజీం ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**పీడీ డీఆర్‌డీఏ బి. నగేష్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగష్టు 28:**అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ అందిస్తున్న 2026--27 విద్యా సంవత్సరపు అజీం ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 31 వరకు మాత్రమే గడువు ఉందని, అర్హులైన విద్యార్థినులు చివరి నాలుగు రోజులను సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని పీడీ డీఆర్‌డీఏ బి. నగేష్ తెలిపారు.అర్హత కలిగిన ప్రతి బాలికకు అవకాశం చేరాలిపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన బాలికలు ఉన్నత విద్యను కొనసాగి
చేందుకు అజీం ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ ఎంతో ఉపయోగకరమైన అవకాశమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళల కుమార్తెలలో అర్హత కలిగిన విద్యార్థినులకు ఈ స్కాలర్‌షిప్‌పై సమాచారం చేరేలా వెలుగు క్షేత్రస్థాయి సిబ్బంది, వీఓఏలు, కమ్యూనిటీ క్యాడర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఎస్‌హెచ్‌జీ సమావేశాల్లో స్కాలర్‌షిప్ వివరాలను తెలియజేయడంతో పాటు, అర్హత ఉన్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకునేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఆయన ఆదేశించారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు, విద్యార్థినులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఏడాదికి రూ.30 వేల స్కాలర్‌షిప్

2026--27 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం డిగ్రీ లేదా డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థినులు ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులని పీడీ నగేష్ తెలిపారు. విద్యార్థినులు 10వ, 12వ తరగతులను ప్రభుత్వ పాఠశాల/కళాశాలలో పూర్తి చేసి ఉండాలి. కోర్సు కాలవ్యవధిని బట్టి ఈ స్కాలర్‌షిప్ 2 నుంచి 5 సంవత్సరాల వరకు కొనసాగుతుందని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి విద్యార్థినికి ఏడాదికి రూ.30,000 చొప్పున స్కాలర్‌షిప్ అందు తుందని ఆయన వివరించారు.

ఆగస్టు 31తో తొలి దశ దరఖాస్తుల గడువు ముగింపుస్కాలర్ షిప్‌కు దరఖాస్తు చేసుకునేం దుకు తొలి దశలో ఆగస్టు 31, 2026 వరకు అవకాశం ఉందని, రెండో దశలో 2027 జనవరి 1 నుంచి జనవరి 31 వరకు దరఖాస్తులు స్వీకరి స్తారని తెలిపారు. తొలి దశ గడువు ముగియ దానికి ఇక నాలుగు రోజులు మాత్రమే ఉన్నందున అర్హత కలిగిన విద్యార్థినులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి

దరఖాస్తు చేసుకునే విద్యార్థినులు ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, 10వ , 12వ తరగతి మార్కుల మెమోలు, అడ్మిషన్ ప్రూఫ్ తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

అర్హత, అవసరమైన పత్రాలు, దరఖాస్తు గడువు తదితర వివరాలను ముందుగా తెలుసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పీడీ డీఆర్‌డీఏ బి. నగేష్ తెలిపారు. దరఖాస్తు ప్రక్రియలో విద్యార్థినులకు అవసరమైన సహాయ సహకారాలు, మార్గదర్శకత్వాన్ని వెలుగు సిబ్బంది, వీఓఏలు అందించాలని సూచించారు.అజీం స్కాలర్‌షిప్ దరఖాస్తు వెబ్‌సైట్ఉన్నత విద్యకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదు

విద్యార్థినుల భవిష్య త్తుకు ఉన్నత విద్య బలమైన పునాది అని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన బాలికలు తమ చదువును మధ్యలోనే నిలిపివేయకుండా ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పీడీ నగేష్ విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ఒక్క విద్యార్థిని కూడా ఈ అవకాశాన్ని కోల్పోకుండా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని వెలుగు సిబ్బంది, వీఓఏలకు సూచించారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ప్రాణాపాయ బాలింతకు 'ఎక్మో'తో ఊపిరిపోసిన యశోద వైద్యబృందం




డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని బృందం

**రాజమహేంద్రవరం పెన్ పవర్, ఆగస్టు 28:** ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన ఒక యువతి అత్యంత ప్రాణాపాయ స్థితికి చేరుకోగా, హైదరాబాద్‌లోని యశోద హైటెక్ సిటీ ఆసుపత్రి వైద్యబృందం అపూర్వ చికిత్సతో ఆమెకు పునర్జన్మ ప్రసాదించింది. 23 ఏళ్ల బాలింతకు ప్రసవ సమయంలో 'పెరిపార్టమ్ కార్డియోమయోపతి' అనే తీవ్రమైన సమస్య ఎదురై గుండె ఆగిపోయింది. పైగా ఇతర అవయవాలు సైతం పనిచేయడం మానేశాయి. ఇలాంటి అత్యంత క్లిష్ట దశలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని నేతృత్వంలోని వైద్య బృందం అత్యాధునిక 'ఎక్మో' (శరీర వెలుపల రక్తానికి ఆక్సిజన్ అందించే సాంకేతికత) విధానాన్ని ఉపయోగించి బాధితురాలిని ప్రాణాపాయం నుంచి సురక్షితంగా కాపాడారు. పదకొండేళ్లకు పైగా కార్డియాలజీ రంగంలో అనుభవం ఉన్న డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని కనబరిచిన అపారమైన సమయస్ఫూర్తి, వైద్య ప్రతిభ ఈ అరుదైన ప్రాణరక్షణలో కీలకపాత్ర పోషించాయి. కార్డియాలజీ విభాగంతో పాటు క్రిటికల్ కేర్, వాస్కులర్ సర్జరీ, ప్రసూతి, స్త్రీరోగ, నెఫ్రాలజీ విభాగాలు సమన్వయంతో శ్రమించి ఈ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. జేసీఐ గుర్తింపు ఉన్న యశోద ఆసుపత్రిలోని ప్రపంచస్థాయి మౌలిక వసతులు ఈ చికిత్సకు ఎంతో తోడ్పడ్డాయి. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఇద్దరూ పూర్తి ఆరోగ్యంతో కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ విశేషాలను స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని, ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి. సాయి కిరణ్ వెల్లడించారు. ప్రాణాలు కోల్పోయే అత్యవసర స్థితిలో ఉన్న రోగులకు ఆధునిక ఎక్మో వ్యవస్థ ఉపయోగపడుతుందని డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని స్పష్టం చేశారు.

## డాస్.ఏ.పి.జె.అబ్దుల్ కాలామ్ స్కూలుకి కాంచో నాగేశ్వరరావు రాక






**తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 28:**రాఖీ పండుగ సందర్భంగా డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలామ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఆల్ ఇండియా గోజుర్యూ కరాటే డో ఫెడరేషన్ ప్రెసిడెంట్, ఇండియా కరాటే హెడ్ కాంచో ఎల్.నాగేశ్వరరావు విచ్చేసిన నేపథ్యంలో స్కూల్ యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణ బెలూన్లతో అలంకరించి, ఆయనకు ప్రత్యేకంగా స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ఆయనతో పాటు గోజుర్యూ ఏపీ చీఫ్ ఎం.వి.రామమూర్తి రాజు, ట్రెజరర్ ఎం.హెచ్.ఎం.ప్రసన్న కుమారి, తూర్పుగోదావరి జిల్లా సెక్రెటరీ కె.ఎస్.మణికంఠ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎల్.నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ విభాగం దేశానికి అందిస్తున్న సేవలను కొనియాడారు.

పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మరక్షణ, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. కాంచో నాగేశ్వరరావు రాక విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని, క్రమశిక్షణను మరింత పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాలకు ఇంత గొప్ప వ్యక్తులు రావడం చాలా గర్వకారణం అని స్కూల్ డైరెక్టర్ స్వామి తెలియజేశారు.

# విద్యార్థులు సామాజిక బాధ్యత, హక్కులపై అవగాహనను పెంచుకోవాలి



**ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు ప్రమోద్ కె. నాయర్**

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 28:**విద్యార్థులు సామాజిక బాధ్యత, హక్కులపై అవగాహనను పెంచుకోవాలని ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు, డాక్టర్ ప్రమోద్ కె. నాయర్ సూచించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె. హిమబిందు ఆధ్వర్యంలో సైన్స్, బాధ్యత మరియు హక్కులను పొందే హక్కు" అనే అంశంపై బీటెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం రవీంద్ర కళాభారతిఆడిటోరియంలో సామాజిక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు ప్రమోద్ కె. నాయర్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం కేవలం విద్యా, పరిశోధనా రంగాలకే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ సామాజిక బాధ్యతలను గుర్తించి సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని చెప్పారు. ప్రస్తుత సమాజంలో హక్కులు, బాధ్యతలపై అవగాహనను కలిగి ఉండటం ప్రతి విద్యార్థికి అవసరమని తెలిపారు. శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించే విధంగా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని




వివరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథంతో పాటు సామాజిక చైతన్యం, బాధ్యతాయుతమైన ఆలోచన విధానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్, ఆచార్యులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ టి.రేష్మా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ఆదిత్య విద్యార్థుల అవగాహన ర్యాలీ

* ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.. ప్రమాదాలను నివారించాలి




**పెన్ పవర్ ప్రతినిధి(పెద్దాపురం) ఆగస్టు 28:** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచి, ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించేందుకు ఆదిత్య యూనివర్సిటీ ఫోరెన్సిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెద్దాపురం మున్సిపల్ సెంటర్ నుంచి దర్గా సెంటర్ వరకు సాగిన ర్యాలీలో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా. కిషోర్, ఎన్ఎస్ఎస్ అధికారి బి.కె. విద్యాసాగర్ నాయకత్వంలో ర్యాలీ కొనసాగింది. విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించిన ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను వివరించారు. హెల్మెట్ ధరించడం, వేగ నియంత్రణ, బాధ్యతాయుతమైన డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వంటి అంశాలపై నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.

ఈ సందర్భంగా పెద్దాపురం ఎస్‌హెచ్‌ఓ యు. పాపారావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై.ఆర్.కె. శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్ల జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

"హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.. ట్రాఫిక్ నిబంధనలు ప్రాణ రక్షణకు మార్గం" అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించి నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని నిర్వాహకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో అధ్యాపకులు జిషాన్ ఖాన్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ నైపుణ్యాలే లక్ష్యంగా ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు




**గండేపల్లి, పెన్ పవర్ ,ఆగస్టు 28:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ & ఎంప్లాయబిలిటీ స్కిల్స్' అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సును ప్రారంభించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు.

విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కోర్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రొఫెషనల్ కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, ఇంట్రాపర్సనల్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఏఐ, ఏఐ ఆధారిత ఎంప్లాయబిలిటీ స్కిల్స్, కెరీర్ రెడీనెస్, ఫ్యూచర్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, రీసెర్చ్ స్కాలర్స్‌కు ఆధునిక ఉద్యోగ అవకాశాలు, అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రో-వైస్ ఛాన్సలర్ (స్ట్రాటజీ & పార్ట్‌నర్‌షిప్) డా. రవితంగజం తెలిపారు.

ఈ ఆన్‌లైన్ కోర్సు ఆగస్టు 24 నుంచి 29వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. రిసోర్స్ పర్సన్‌లుగా డా. నీలిమ, డా. మారియా అస్లాం, డా. ఫైజాన్ షబ్బీర్, డా. ఫైజా అబ్బాసీ వ్యవహరిస్తున్నారు.

కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ డా. బి. సౌజన్య, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కో-ఆర్డినేటర్ డా. ఐ. వీరాంజనేయులు, ఏరియా చైర్--జనరల్ మేనేజ్‌మెంట్ డా. ఫైజాన్ షబ్బీర్, డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్ డా. వి. వెంకటేశ్వరరావుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం






**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 28:** కాకినాడ జీఎంసీ బాలయోగి జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ప్రారంభమైంది.జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన,జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సమక్షంలో సమావేశం నిర్వహించారు.సమావేశానికి శాసన మండలి సభ్యులు కుడిపూడి సూర్యనారాయణరావు,పేరాబత్తుల రాజశేఖరం,డా.బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో వి.సుబ్బారావు, జిల్లా పరిషత్ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు తదితరులు హాజరయ్యారు.వివిధ మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చ ప్రారంభమైంది. ముఖ్యంగా నీటిపారుదల, వ్యవసాయం, ఉద్యాన శాఖలకు సంబంధించిన అంశాలపై సభ్యులు చర్చించారు. ఆయా రంగాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రైతులకు అందుతున్న సేవలు, సాగునీటి పరిస్థితులపై సమావేశంలో చర్చ కొనసాగింది.

# ఎన్ఈపీ--2020కు అనుగుణంగా బి.ఫార్మ్ పాఠ్యప్రణాళిక--2026







**సమర్థవంతమైన అమలుపై అధ్యాపకులకు అవగాహన**

**గండేపల్లి,పెన్ పవర్, ఆగస్టు 28:** జాతీయ విద్యా విధానం--2020 (ఎన్ఈపీ)కి అనుగుణంగా రూపొందించిన బి.ఫార్మ్ పాఠ్యప్రణాళిక--2026ను సమర్థవంతంగా అమలు చేయడంపై ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (అటానమస్), ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ), న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో ఒకరోజు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.

ఫార్మసీ విద్యలో నూతన మార్పులు, ఫలితాల ఆధారిత విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థుల ఉపాధి అవకాశాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యను తీర్చిదిద్దడంపై కార్యక్రమంలో నిపుణులు అధ్యాపకులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్, ఆదిత్య యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎన్. సతీష్ రెడ్డి స్వాగత ప్రసంగం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రవి శంకర్ తమ అభిప్రాయాలను వెల్లడించారు. పీసీఐ వైస్ ప్రెసిడెంట్ శ్రీ జశుభాయ్ హీరాభాయ్ చౌదరి ప్రారంభోపన్యాసం చేశారు.

పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డా. దీపేంద్ర సింగ్, డా. ఎం. నిరంజన్ బాబు, డా. ఎం.వి. రమణ, డా. డి. నరేంద్ర పాల్గొన్నారు. బెంగళూరులోని అల్-అమీన్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. ఎం.డి. సలాహుద్దీన్ బి.ఫార్మ్ పాఠ్యప్రణాళిక--2026లోని ముఖ్యాంశాలు, వాటి అమలు విధానాన్ని సమగ్రంగా వివరించారు. అనంతరం అధ్యాపకుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు.

పరిశోధన, ఉపాధి సామర్థ్యం, ఉద్యోగ అవకాశాలపై కొత్త పాఠ్యప్రణాళిక ప్రభావం అనే అంశంపై హైదరాబాద్ ఐఐసీటీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. కె. సురేష్ బాబు ప్రసంగించారు. కొత్త సిలబస్ ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలను పెంపొందించే అంశాలను వివరించారు.

మణిపాల్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. అనూప్ కిషోర్ ఫార్మసీ విద్యలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతపై వివరించారు.

ఈ సందర్భంగా పీసీఐ వైస్ ప్రెసిడెంట్ జశుభాయ్ హీరాభాయ్ చౌదరి, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డా. దీపేంద్ర సింగ్, డా. ఎం.వి. రమణ, డా. ఎం. నిరంజన్ బాబు, డా. డి. నరేంద్ర తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌లుగా సేవలందించిన డా. ఎం. నిరంజన్ బాబు, డా. కె. సురేష్ బాబు, డా. ఎం.డి. సలాహుద్దీన్ తదితరులను కూడా సత్కరించారు. విజెఎస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్, పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డా. డి. నరేంద్రకు ప్రత్యేకంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు.

వివిధ ఫార్మసీ కళాశాలలకు చెందిన ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యావేత్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జెన్-జీ యువతతో వినూత్నంగా రాఖీ వేడుకలు నిర్వహించిన ఎంపీ సానా సతీష్ బాబు



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 28:** ప్రతి ఏటా రాఖీ పండుగను వినూత్నంగా జరుపుకునే రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఈ ఏడాది కాకినాడ జిల్లాకు చెందిన జెన్-జీ యువతతో ప్రత్యేకంగా రాఖీ వేడుకలు నిర్వహించారు. కొప్పవరం కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాశాల విద్యార్థినులు పాల్గొని ఎంపీ సానా సతీష్ బాబుకు రాఖీలు కట్టారు.

అనంతరం యువతతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ ఎంపీ స్నేహపూర్వకంగా ముఖాముఖి ముచ్చటించారు. వారి ఆకాంక్షలు, కెరీర్ లక్ష్యాలు, విద్య, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, కాకినాడ అభివృద్ధిపై వారి ఆలోచనలను అడిగి తెలుసుకున్నారు. యువతతో వారి శైలిలోనే సరదాగా, ఆత్మీయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ కాకినాడలో యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఆధునిక రంగాల్లో కొత్త అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, యువనేత, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో యువతకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

రాఖీ వేడుకల్లో పాల్గొన్న జెన్-జీ యువతకు ఎంపీ గిఫ్టులు, చాక్లెట్లు అందజేసి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. కేవలం పండుగ వేడుకగా కాకుండా యువతతో నేరుగా మమేకమై వారి ఆలోచనలు, ఆకాంక్షలను తెలుసుకోవడంతో పాటు భవిష్యత్ కాకినాడపై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సానా సతీష్ బాబు తెలిపారు.

## ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో 'మైక్రోసాఫ్ట్ అజ్యూర్'పై వర్క్‌షాప్






**గండేపల్లి , పెన్ పవర్, ఆగస్టు 28:** గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో 'మైక్రోసాఫ్ట్ అజ్యూర్: అడ్వాన్స్‌డ్ క్లౌడ్ ఆర్కిటెక్చర్ అండ్ ఇంజినీరింగ్' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఆగస్టు 28, 29 తేదీల్లో కళాశాల సీ-ఎస్-ఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థులకు క్లౌడ్ టెక్నాలజీలపై అధునాతన పరిజ్ఞానం అందించడంతో పాటు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా మాటాడుతు రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, అడ్వాన్స్ క్లౌడ్ ఆర్కిటెక్చర్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. క్లౌడ్ టెక్నాలజీల ప్రాధాన్యత, ప్రాక్టికల్ అప్లికేషన్లు, పరిశ్రమలో వాటి వినియోగంపై విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ అందించనున్నారు.

ఈ వర్క్‌షాప్‌లో సీ-ఎస్-ఈ విభాగాధిపతి శ్రీ జి. సత్యమోహన్ చౌదరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

**అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడుకు రాఖీ కట్టిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు**




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 28:** సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను కాకినాడలోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డి.అశ్విని ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు,వైస్ ప్రిన్సిపాల్ సి. సత్యనారాయణకు రాఖీలు కట్టి వారి క్షేమాన్ని ఆకాంక్షించారు.సోదర సోదరీమణుల మధ్య ప్రేమ,గౌరవం, పరస్పర రక్షణ భావనతో మెలగాలని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ.. రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, ప్రేమ,నమ్మకం,బాధ్యత, ఆత్మీయతలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకుని, వాటి విలువలను భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు.రక్షాబంధన్ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సోదరభావం,పరస్పర గౌరవం, మానవతా విలువలను పెంపొందించేలా సాగింది.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ తేజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నవరం ఆలయంలో డ్రోన్ నిఘా

**భక్తుల భద్రతకు కాకినాడ జిల్లా పోలీసుల పటిష్ట చర్యలు**





**అన్నవరం/కాకినాడ ,పెన్ పవర్,ఆగస్టు 28:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ రమా వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం పరిసరాల్లో కాకినాడ జిల్లా పోలీసులు భద్రతా చర్యలను మరింత పటిష్టం చేశారు. జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఆదేశాల మేరకు భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా అన్నవరం పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా దేవస్థానం పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలు, ఇతర కీలక ప్రాంతాలను డ్రోన్ నిఘాతో పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ దేవస్థానం పరిసరాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అన్నవరం ఎస్సై జి. శ్రీహరి బాబు తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com